# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**OCTOBER - 2016**

సంవత్సర చందా రూ. 50/-

# బైబిలు లెక్చెర్‌షిప్
## సత్యవాణి - క్రీస్తు సంఘము

| | | |
|---|---|---|
| స్థలము | : | క్రీస్తు సంఘము<br>7-9-35, సాంబమూర్తి వీధి, సత్యవాణి<br>కాకినాడ |
| తేదీలు | : | 2016 నవంబరు 8,9,10,11<br>మంగళ, బుధ, గురు, శుక్రవారములు |
| సమయం | : | ఉదయం 10.00 గం॥లకు<br>మధ్యాహ్నం 2.00 గం॥లకు<br>సాయంత్రం 7.00 గం॥లకు |
| ప్రసంగీకులు | : | బ్రదర్. థెర్మన్ హోడ్జ్, యు.ఎస్.ఎ.<br>బ్రదర్. రోజర్ రైట్, యు.ఎస్.ఎ.<br>బ్రదర్ లూయిస్ రష్మోర్, యు.ఎస్.ఎ.<br>బ్రదర్. జాన్‌డీన్, ఇండియా మరియు<br>బ్రదర్. జ్ఞాన సుధీర్, ఇండియా |

మీరు సకుటుంబ సపరివారముగా, మీ స్థానిక సంఘముతో కలసి రండి. భోజన వసతులు ఉచితం. మొదటిరోజున 20 రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలెను. అందరికి స్వాగతం.


బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. రిక్కీ గూటం

0884 - 2363722
98489 98547

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక - 37 అక్టోబర్- 2016 సంచిక -3


## క్రైస్తవుడు - హింసలు

## *(The Christian and Persecution)*

క్రైస్తవుని జీవితము సుఖ సంపదలతో తులతూగుచున్న జీవితము అని నీవనుకొనుచున్నావా? అట్లు కానేకాదు. క్రైస్తవునికి ఇహలోకపు దీవెనలు, పరలోకపు దీవెనలు లభించ వచ్చును గాని నిజక్రైస్తవుని జీవితము అనేక శోధనలతోను, హింసలతోను నిండి యుండవచ్చును. అందుకే యేసుక్రీస్తు తన శిష్యులతో ఈ విషయమును గూర్చి నిష్కపటముగ బోధించెను. తనను వెంబడించు వారికి ఆయన సుఖ సౌకర్యములతో కూడిన జీవితమును ఎన్నడు వాగ్దానము చేయలేదు. నీతిగల జీవితమును జీవించు తన శిష్యులకు ఆయన ఇహలోక గౌరవ మర్యాదలను వాగ్దానము చేయలేదు. సరిగదా, ఆయన అడుగుజాడలలో నడుచుకొను వారి జీవితము ఈ భూమి పై అంత తేలికయైనది కాదని ఆయన ఎరుగును. తన శిష్యులకాయన ఇట్లు బోధించెను. "లోకము మిమ్మును ద్వేషించిన యెడల మీకంటె ముందుగా నన్ను ద్వేషించెనని మీరెరుగుదురు. మీరు లోకసంబంధు లైన యెడల, లోకము తన వారిని స్నేహించును; అయితే మీరు లోక సంబంధులు కారు; నేను మిమ్మును లోకములో నుండి ఏర్పరచు కొంటిని; అందుచేతనే లోకము మిమ్మును ద్వేషించు చున్నది...లోకులు నన్ను హింసించిన యెడల, మిమ్మును కూడ హింసింతురు" అని యేసు తన శిష్యులను హెచ్చరించెను (యోహాను 15:18-20)

క్రీస్తు సువార్తను చాటుటలో అపొస్తలుడైన పౌలు అందరికంటె ఎక్కువ శ్రమపడెను. అతడు క్రైస్తవుడు కాక ముందు క్రైస్తవులను ఘోరముగ హింసించెను. అయితే తానే క్రైస్తవుడై మరింత ఘోరముగ హింసింపబడెను. క్రీస్తు నిమిత్తమై అతడు పొందిన శ్రమలలో కొన్నిటిని అతడు ఇట్లు తెలియజేసెను. "నేను విశేషముగా ప్రయాస పడితిని, మరి అనేక పర్యాయములు చెరసాలలో యుంటిని; అపరిమితముగా దెబ్బలు తింటిని, అనేకమారులు ప్రాణాపాయము లలో యుంటిని, యూదులచే అయిదు మారులు ఒకటి తక్కువ నలువది దెబ్బలు తింటిని; ముమ్మారు బెత్తములతో కొట్టబడితిని; ఒకసారి రాళ్ళతో కొట్టబడితిని; ముమ్మారు ఓడ పగిలి శ్రమపడితిని; ఒక రాత్రిం బవళ్ళు సముద్రములో గడిపితిని. అనేక పర్యాయములు ప్రయాణములోను, నదుల వలననైన, ఆపదలలోను, దొంగలవలన, స్వజనులవలన, అన్య జనులవలన, పట్టణములో, అరణ్యములో, సముద్రములో ఆపదలలోను, కపట సహోదరులవలన ఆపదలలోను ఉంటిని. ప్రయాసముతోను, కష్టములతోను తరచుగా జాగరణములతోను, ఆకలి దప్పులతోను, తరుచుగా ఉపవాసముల తోను, చలితోను, దిగంబరత్వముతోను ఉంటిని. ఇంకను చెప్పవలసినవి అనేకము లున్నవి" (2 కొరింథి 11:23-28).

పౌలు ఇచ్చిన ఈ సాక్ష్యములో తాను పొందిన శ్రమలలో కొన్నిటిని మాత్రమే అతడు తెలియజేసెను. అందువలన క్రైస్తవులు తమ విశ్వాసము నిమిత్తమై శ్రమలు, హింసలు ఎదుర్కొనుటకు సిద్ధపడి యుండవలెనని చెప్పుచు "క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రదుక నుద్దేశించు వారందరు హింస పొందుదురు" అని అతడు 2 తిమోతి 3:12లో హెచ్చరించెను.

భౌతిక సంబంధమగు విషయము లలో మానవుల జీవితములను తేలిక చేయుటకు యేసు రాలేదు. గాని ఆయన నిమిత్తము పొందు హింసల ద్వారా అగ్నిలో పుటము వేయబడిన రీతిగా వారిని పవిత్రులను చేయుటకు ఆయన వచ్చెను. అందువలన క్రైస్తవుడగు ప్రతివాడును క్రీస్తును వెంబడించుటలో తాను ఎదుర్కొనబోవు సమస్యలను పూర్తిగా ఎరిగినవాడై యుండవలెను.

క్రైస్తవులు హింసలను ఎందుకు ఎదుర్కొన వలసి వచ్చును ? అని మీరను కొనుచుండవచ్చును. మొదటిగా క్రీస్తు శిష్యులు ఈ లోకము నుండి వేరుగా యున్నవారు గనుక వారు హింసలు పాలగుదురు. పాపము లేని యేసు జీవితము ఆనాటివారికి కంటకముగా ఎట్లుండెనో అట్లే నీతిపరులైన క్రైస్తవుల జీవితము ఈ నాడు లోకమునకు కంటకముగా యుండును. అవినీతిపరులు ఆనాడు యేసుక్రీస్తును ఎట్లు హింసించిరో

అట్లే నేడు కూడ ఆయన శిష్యులను హింసింతురు. అందుకే "లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నాను" అని యేసు తన శిష్యులకు ముందుగానే ఆదరణ యిచ్చెను. అపొ. పేతురు క్రైస్తవుల నిట్లు హెచ్చరించు చున్నాడు. "పోకిరి చేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితో కూడిన ఆట పాటలు, త్రాగుబోతుల విందులు, చేయదగని విగ్రహపూజలు మొదలైన వాటియందు నడుచుకొను... అపరిమితమైన ఆదుర్వ్యాపారము నందు, తమతో కూడ మీరు పరుగెత్తక పోయినందుకు వారు (అనగా లోకులు) ఆశ్చర్యపడుచు మిమ్మును దూషించుచున్నారు" (1పేతురు 3:3,4). పౌలు క్రైస్తవుడు కాగానే అతని హింసించిన వారిలో తన పూర్వకాలపు మిత్రులు లేకపోలేదు. నేడు కూడ క్రైస్తవులగు వారు తమలో కలిగిన మార్పును బట్టి ఒకనాటి తమ మిత్రులే శత్రువులుగా మారుటను అనేక సందర్భ ములలో కనుగొనుచున్నాము.

రెండవదిగా, సత్యము యొక్క విశిష్టతను బట్టి క్రైస్తవులు హింసలు పొలగుదురు. పాపులను రక్షించుటకు క్రీస్తు సువార్తయే దేవుని శకియై యున్నదని, యేసుక్రీస్తును, ఆయనే లోకరక్షకుడని పౌలు సత్యమును ప్రకటించుట విరమించు కొనిన యెడల అతడు శ్రమల నెదుర్కొన నవుసరము లేకపోవును. మొదటి శతాబ్దపు క్రైస్తవులు క్రీస్తు కాదు, కైసరే ప్రభువు అని ఒప్పుకొనిన యెడల హింసింపబడక పోవుదురు. అయితే తమ ప్రాణములు పోయినను సరే నాటి క్రైస్తవులు కైసరు కాదు, క్రీస్తే ప్రభువు; ప్రభువు ఒక్కడే, ఆయనే క్రీస్తు యేసు అని సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చిరి (1కొరింధి 8:6). లక్షలాది క్రైస్తవులు అందువలన తమ ప్రాణములను కోల్పోయిరి. ఈనాడుకూడ ప్రభువు ఒక్కడే, విశ్వాసము ఒక్కటే, బాప్తిస్మము ఒక్కటే, క్రీస్తు సంఘము ఒక్కటేయను సత్యమును బోధించుచున్నప్పుడు వాటికి విరుద్ధముగా బోధించు వారి హృదయములలో అసూయ, ద్వేషములు జనింపజేయబడుట వలన వారు నిజ క్రైస్తవులను హింసించుటకు పూనుకొను చున్నారు. అయితే క్రీస్తుసంఘము యెదుట పాతాళలోక ద్వారములు సహితము నిలువనేరవని యేసు వాగ్దానము చేసెను (మత్తయి 16:18).

అందువలన నీతి నిమిత్తము సత్యమును బోధించుచు దానినెవరు అవలంబింతురో వారు హింసలను ఈ లోకములో ఎదుర్కొనుట సహజము. అపొ.పౌలు అందువలననే హింసించ బడెను. క్రీస్తు నిమిత్తము ఎవరైనను ఈనాడు హింసింపబడుచున్నారంటే అందువలననే హింసింపబడుదురు. నేడు

కూడ అనేక ప్రాంతములలో క్రీస్తు సువార్తను బోధించు చున్నందున సువార్తికులను హింసించుట, భయపెట్టుట, చివరకు చెరసాలలో వేయుటకూడ జరుగుచున్నది. ఒక్కొక్కసారి క్రొత్తగా క్రీస్తులోనికి వచ్చినవారికి తమ కుటుంబముల నుండి, బంధుమిత్రుల దగ్గర నుండి శోధనలు సంభవించుచున్నవి.

అయితే ఇట్టివాటిని గూర్చి క్రీస్తు ముందుగనే బోధించెను గనుక అవి సంభవించినప్పుడు క్రైస్తవుడు ఆశ్చర్యపడ నవసరములేదు, సరిగదా అతడు అమితముగా సంతోషింపచవలెను. "ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమను గూర్చి మీకేదోయొక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి. క్రీస్తు మహిమ బయలు పరచబడినప్పుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము, క్రీస్తు శ్రమలలో మీరు పాలివారై యున్నంతగా సంతోషించుడి" అని అపో. పేతురు హెచ్చరించుచున్నాడు (1పేతురు 4:12, 13). క్రీస్తు నామమును బోధించు చున్నందున అపొస్తలులు కొరడాలతో కొట్టబడిరి, చెరసాలలో వేయబడిరి. అయినను క్రీస్తు నామము కొరకు వారు అవమానము పొందుటకు పాత్రులని యెంచబడినందున వారు సంతోషించిరి (అపో.కా. 5:40,41). పౌలు, సీలయను క్రీస్తు పరిచారకులు కొట్టబడి ఫిలిప్పియలో చెరసాలలో వేయబడితే వారు చెరసాలలో నుండి దేవునికి స్తుతికీర్తనలు పాడిరి (అపో.కా. 16:25). అందువలన చెరసాలలో బంధింపబడి యుండినను పౌలు, "ఎల్లప్పుడును ఆనందించుడి, మరల చెప్పుదును, ఆనందించుడి" యని క్రైస్తవులకు హెచ్చరిక మాటలను వ్రాసెను.

క్రీస్తు కొరకు నీవు హింసింపబడు చున్న యెడల సిగ్గుపడక ఆ నామమును బట్టియే దేవుని మహిమపరచుము (1పేతురు 4:16). అది నిజక్రైస్తవుని లక్షణము. హింసల నొందుచున్న యెడల యేసుయొక్క వాగ్దానములను జ్ఞాపకము చేసికొనుము! "నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది. నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును" (మత్తయి 5:10-12). "అంతమువరకు సహించిన వాడెవడో వాడే రక్షింపబడును" "మరణము వరకు నమ్మకముగా ఉండుము, నేను నీకు జీవకిరీటమిచ్చెదను" అని ఆయన చెప్పుచున్నాడు (మత్తయి 24:13, ప్రకటన 2:10). నీవు ముక్తి నొందవలెనంటే ఈ లోకమును కాదు గాని క్రీస్తును ప్రేమించి ఆయనకు విధేయుడవు కమ్ము!

# దేవుడు

## (The God head)

దైవత్వము (దేవుడు)లో ముగ్గురు మూర్తులున్నారని దిగువలేఖనములు సూచించుచున్నవి.

యోహాను 1:1-2లో వాక్యమునకు దేవునికి మధ్యయున్న సంబంధమును వర్ణించుటలో రెండువేర్వేరు వ్యక్తులున్నట్లు తెలియజేయబడినది.

"ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్దఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను" (యోహాను 1:1-2).

1. 'దేవునియొద్ద' - అనుమాటలు, దేవుని ప్రక్కన, ఆయన దగ్గర అను దానిని సూచించుచున్నది.

2. గనుక వాక్యము, తండ్రియైన దేవుడు వేర్వేరు వ్యక్తులైయున్నారు.

**సృష్టిజరిగించబడినప్పుడు బహు వచనము వినియోగించబడినది.** అనగా ఒకరి కంటె ఎక్కువమంది అందులో పాల్గొనిరి. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆది.కా. 1:1). దేవుడు అను పదముకు హెబ్రీభాషలో ఎలోహిమ్ అను పదము వినియోగించబడెను. ఎలోహిమ్ ఒక బహువచన నామవాచకము. అనగా ఆ మాటలో ఒకరి కంటె ఎక్కువ వ్యక్తులున్నట్లు సూచించబడుచున్నది.

**దిగువ లేఖనాలలో వ్రాయబడిన నామవాచకము దేవునిలో ఒకరి కంటె ఎక్కువ మూర్తులున్నట్లు వ్యక్తమగుచున్నది.**

"దేవుడు - మన స్వరూపమందు మన పోలికచొప్పున నరులను చేయుదము" (ఆది కా 1:26).

"అప్పుడు దేవుడైన యెహోవా - ఇదిగో మంచిచెడ్డలను ఎరుగునట్లు ఆదాము మనలో ఒకని వంటివాడాయెను" అనెను (ఆది.కా. 3:22).

"గనుక మనము దిగిపోయి వారిలో ఒకని మాట ఒకనికి తెలియకుండ అక్కడ వారి భాషను తారుమారు చేయుదము రండని అనుకొనెను" (ఆది.కా. 11:7).

"అప్పుడు నేను ఎవని పంపెదను. మానిమిత్తము ఎవడుపోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని" (యెషయా 6:8)

**తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు వేర్వేరు వ్యక్తులుగా యేసు బాప్తిస్మము పొందినప్పుడు ప్రత్యక్షపరచబడిరి.**

"యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్లలోనుండి ఒడ్డునకు వచ్చెను, ఇదిగో ఆకాశము తెరువబడెను, దేవుని ఆత్మ పావురము వలె దిగి తనమీదకి వచ్చుట చూచెను. మరియు ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను అను యొక శబ్ధము ఆకాశము నుండి వచ్చెను" (మత్తయి 3:16-17).

ఇక్కడ ఒక్క సందర్భములో దైవత్వములోని వ్యక్తులు వేర్వేరుగా ప్రత్యక్షమగుట చూడగలము.

1. యేసు బాప్తిస్మము పొందుట (కుమారుడు)
2. పరిశుద్ధాత్ముడు దిగుట
3. తండ్రి ఆకాశము నుండి పలుకుట.

గొప్ప ఆజ్ఞలో తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు వేర్వేరు వ్యక్తులుగా కనబడుదురు.

"కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి, తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి" (మత్తయి 28:19).

ఈ లేఖన భాగములో తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు వేర్వేరు వ్యక్తులుగా ఉదహరించబడిరి. వారు ముగ్గురు ఒకే వ్యక్తిగాక, వేర్వేరు ప్రత్యేక మూర్తులుగా యున్నారు. ఈ ముగ్గురు వ్యక్తులను సంబోధించుచు వారి <u>యొక్కయు</u> అను పదమువాడబడెను. అంటే ఒకరితో కలసి మరియొకరు, ఒకరి తరువాత మరియొకరు అనుభావము అందులో మిళితమైయున్నది.

యేసు మోషే ధర్మశాస్త్రమును వినియోగిస్తు ఆయనకు ఇద్దరు వేర్వేరు సాక్షులు (తానను, తండ్రియు) వున్నట్లు, తన బోధయధార్ధమనుటకు చెప్పెను.

"ఏ అపరాధమును గూర్చియేగాని, ఏ పాపమును గూర్చియేగాని ఒక సాక్షి యొక్క సాక్ష్యము అంగీకరింపకూడదు, ఇద్దరు సాక్షులమాట మీదనైనను ప్రతి సంగతి స్థిరపరచబడును" (ద్వితీ 19:15).

"మరియు ఇద్దరు మనుష్యుల సాక్ష్యము సత్యమని మీ ధర్మశాస్త్రములో వ్రాయబడియున్నది గదా. నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనువాడను, నన్ను పంపిన తండ్రియు నన్ను గూర్చి సాక్ష్యమిచ్చు చున్నాడని" యేసు చెప్పెను (యోహాను 8:17-18).

యేసే తండ్రియై యున్నాడని చెబితే, ఆయన ఇక్కడ యిచ్చిన వివరణ నిష్ప్రయోజనము.

ఐక్యత కొరకు యేసుచేసిన ప్రార్ధనలో తండ్రియు, యేసును వేర్వేరు

వ్యక్తులన్నట్లు ఆయన ప్రార్థించెను.

యోహాను 17:20-21లో "తండ్రీ, నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున..నాయందు విశ్వాసముంచు వారందరు ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాననెను".

మనందరం వేర్వేరువ్యక్తులమని మనమెరుగుదుము, తండ్రియు, యేసును ఏకమైయున్నట్లు మనము కూడ ఏకమై యుండవలెనని ఆయన కోరుచున్నారు.

గనుక తండ్రికి, యేసుకు మధ్య యున్నట్టి ఏకత్వము వారి తలంపులలోను, కార్యములలోను, సంకల్పములోను మరియు అన్ని విషయములలోను వారు ఐక్యత కలిగియుండిరి.

1 తిమోతి 2:5 దేవుడును, యేసును వేర్వేరు వ్యక్తులని చెప్పుచున్నది. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు".

ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యవహరించు వాడు మధ్యవర్తియగును. ఇక్కడ దేవుడు, నరులు వేర్వేరు వ్యక్తులు, గనుక వీరిద్దరికి మధ్యవర్తిగయున్న ప్రత్యేక వ్యక్తి యేసుక్రీస్తు.

1. దేవుడు
2. మధ్యవర్తి (యేసుక్రీస్తు)
3. మానవుడు

యేసు తండ్రికి చేసిన ప్రార్థనలో ముగ్గురు వేర్వేరు వ్యక్తులు సూచించ బడ్డారు. "నేను తండ్రిని వేడుకొందును. మీ యొద్ద ఎల్లప్పుడునుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపి యైన ఆత్మను మీకనుగ్రహించును" (యోహాను 14:16,17).

1. యేసు వేరొక ఆదరణకర్తను పంపుమని తండ్రిని వేడుకొన్నారు. వేరొక అనగా ఇంకొక వ్యక్తి అని అర్థము.

2. గనుక యేసుచేసిన ప్రార్థనలో ముగ్గురు వేర్వేరు వ్యక్తులు మనకు కనబడుచున్నారు.

కుమారుడు ప్రార్థించుచున్నాడు.

తండ్రి వేరొక ఆదరణకర్తను అనుగ్రహించుచున్నారు.

వేరొక ఆదరణకర్త సత్యస్వరూపి యైన పరిశుద్ధాత్ముడే.

"ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవునిప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసము మీకందరికి తోడైయుండును గాక!" (2 కొరింధీ 13:14)

– జాన్ బార్కర్



# యేసు యొక్క దైవత్వము - I
## (The Deity of Jesus-I )

దైవత్వము అనగా దేవుని యొక్క తత్వము, దైవము అయ్యుండుట అని యర్థము. గనుక మనము క్రీస్తు యొక్క దైవత్వాన్ని పరిశీలించునపుడు ఆయనలో యున్న దైవత్వమును, అయన దేవుని కుమారుడనని చెప్పుకొనిన దానిలోని సత్యమును పరిశీలింతుము. పాపము నుండి మానవజాతి యంతయును ఒక మధ్యవర్తి ద్వారా విమోచింపబడవలసి యున్నది. ఆ మధ్యవర్తి దేవుని, మానవుని సమాధానపరచి ఏకపరచు నిమిత్తము దైవ మానవత్వములను రెంటిని కలిగినవాడై యుండవలెను. యేసు ఈ రెండింటిని కలిగియుండెను.

యేసుక్రీస్తు గొప్ప అద్భుతశక్తి కలిగినవాడే గాని ఆయనలో దైవత్వము లేదని కొందరు చెప్పుచుందురు. మరి కొందరయితే యేసుక్రీస్తు కూడా సృష్టింపబడిన వ్యక్తియనియు, ఆయనను దేవుడు ముందుగా సృజించెననియు చెప్పుచుందురు. 'యెహోవా సాక్షులు' అను ఒక గుంపువారు నేటికిని ఈ సంగతిని బోధింతురు. అట్లు బోధించుటలో యేసు దేవుడు కాదని వారి ముఖ్యోద్దేశము.

"ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను" అని యోహాను 1:1లో వ్రాయబడియున్నది. ఈ వాక్యము యేసుక్రీస్తని మనము యోహాను 1:14లో చదువగలము. "ఆ వాక్యము శరీరధారియై సత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను''. యోహాను వ్రాసిన ఆదికాలము దేవుడు సమస్తమును సృజించిన కాలారంభమునకు ముందును సూచించుచున్నది. అదే మాటలతో మోషే ఆదికాండము వ్రాయుటకారంభించెను. ఆదియందు వాక్యముండెను అని యోహాను వ్రాసెనుగదా, అయితే వాక్యము ఎప్పటినుండి ఉండెను? అనేప్రశ్న మనకు రావచ్చును. ఆ వాక్యము నిత్యము, యెల్లప్పుడు ఉండెను అని మనము జవాబీయవలసి వచ్చును. ఆ వాక్యము క్రీస్తయి యుండెను. ఆయన దేవుని యొక్క ప్రత్యక్షతయై యుండెను. ఈ లోకములో ఆయన దేవుని యొక్క సర్వసంపూర్ణత యొక్క ప్రత్యక్షతయై యుండెను. 'వాక్యము దేవుని యొద్ద ఉండెను' అని యోహాను వ్రాసెను. దేవుని యొద్ద అనగా తండ్రియైన దేవునితో ముఖాముఖిగా యుండుట, ఆయనతో సజీవము గల సంబంధమును, అతి సన్నిహితమైన సహవాసమును, ఏకత్వము కలిగి యుండుటను సూచించుచున్నది. మరల,

వాక్యము దేవుడై యుండెను అని యోహాను వ్రాసెను. అట్లు వ్రాయుటలో వాక్యము దేవుని యొక్క తత్వమును కలిగి యుండెను, వాక్యమే దేవుడై యుండెను అని అతడు మనకు తెలియజేయు చున్నాడు. ఆదియందు త్రియేకుడైన దేవునిలో వాక్యము ఒక వ్యక్తియై యుండెనని మనము గ్రహించవలెను.

క్రీస్తు తండ్రియైన దేవునితో సమానుడై యుండెను. ఫిలిప్పీ 2:5-8లో అపో. పౌలు ఇట్లు వ్రాసెను. "క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచి పెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా తన్నుతాను తగ్గించుకొనెను".

మనము చదువకొనిన వాక్య భాగములో పౌలు ఫిలిప్పయిలో యున్న క్రైస్తవులకు వినయ విధేయతలను గూర్చి బోధించుచుండెను. వినయ విధేయతలకు క్రీస్తు గొప్ప మాదిరిగా యున్నాడు గనుకనే క్రీస్తుకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి యని అతడు హెచ్చరించాడు. తన్నుతానే క్రీస్తు యెట్లు తగ్గించుకొనెనో పౌలు ఈ సందర్భములో చూపించుచున్నాడు. ఈ లోకమునకు రాకముందు యేసుక్రీస్తు దేవుని స్వరూపమును, అనగా దైవత్వమును కలిగి యుండెను. ఆయన దేవునితో సమానముగా యున్నను, ఆయన దానిని విడిచిపెట్టి యిష్టపూర్వముగా పరలోకము నుండి, ఈ లోకమునకు వచ్చెను. అట్లు చేయుటలో ఆయన దాసుని స్వరూపమును ధరించుకొని ఆకారమందు మనుష్యుడుగా యీలోకమునకు వచ్చెను. ఆయన మరణము పొందునంతవరకు, అనగా అతిహీనకరమైన సిలువ మరణము పొందునంతవరకు తన్నుతాను తగ్గించు కొనెను. మనము రక్షించబడునట్లు దీనినంతటిని ఆయన చేసెను.

ఈ వాక్యమును బట్టి క్రీస్తు యొక్క నిత్యత్వమును మనము గమనించగలము. ఆయన ఈ లోకమునకు రాకముందు తండ్రియైన దేవునితో యెల్లప్పుడు ఉండెను. ఆయన దేవుని స్వరూపములో యుండెను. తండ్రికేమైతే గుణలక్షణము లుండెనో వాటినే ఆయనకూడ కలిగి యుండెను. క్రీస్తు తన్నుతాను రిక్తునిగా

చేసికొనినప్పుడు పరలోక మహిమలన్నిటిని విడిచిపెట్టి మానవ శరీరమును ధరించెను. లోకము పుట్టక మునుపు నుండి ఆయన మహిమను కలిగి యుండెను. భూమి మీద యున్నప్పుడు ఆయన యిట్లు ప్రార్థించెను. "తండ్రీ లోకము పుట్టక మునుపు నీయొద్ద నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమ పరచుము" (యోహాను 17:5). ఆయన చనిపోయి, సమాధి చేయబడి తిరిగి లేచి పరమునకు వెళ్ళి తండ్రితో యింతకు ముందున్న మహిమను ఇప్పుడు కలిగియున్నారు.

క్రీస్తునందు దైవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా నివసించుచుండెను. కొలస్సయిలో కొన్ని అబద్ధ సిద్ధాంతములు బోధింవబడుటను విని పౌలు కొలస్సయిలో యున్న సంఘమునకు ఒక పత్రికను వ్రాసెను. మోషే ధర్మశాస్త్రము ఇంకను నిలిచి యున్నదనియు, యేసుక్రీస్తు నిజముగా దేవుడు కాదనియు ఆ అబద్ధ బోధకులు ప్రచారము చేయుట మొదలిడిరి. గనుక పౌలు వారిని ఇట్లు హెచ్చరించెను. " ఆయనను అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారములను, అనగా ఈలోక సంబంధమైన మూల పాఠములను అనుసరించి మోసకరమైన నిరర్థకతత్వజ్ఞానముచేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవడైన ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుడి. ఏలయనగా దైవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" (కొలస్స 2:8,9). బైబిలులో క్రీస్తు యొక్క దైవత్వమును బలముగా చూపించు వచనములలో ఇది ఒకటి. యేసుక్రీస్తు శరీరమును ధరించిన దేవుడై యున్నాడని పౌలు చెప్పుచున్నాడు. ఏ విషయములో నైనను ఆయనలో దైవత్వము లేకుండలేదు. అందువలన క్రీస్తు దేవుడు కాదని వాదించువారి తత్వజ్ఞానము అసత్యమని నిరూపింపబడెను. అంతేకాదు, యేసుక్రీస్తు "అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యుండెను" అని కొలస్స 1:15లో అతడు పలికెను. అంటే దేవుని యొక్క మూర్తిత్వము, పరిపూర్ణతలు క్రీస్తులో సంపూర్ణముగ ప్రతిబింబించెను. ఆయన దైవత్వమును ఎట్లు కలిగి యున్నాడో తరువాత వచనములో అతడు తెలియజేసెను. ఆయన జ్ఞానమందును, సృషించే శక్తియందును, నిత్యఉనికి యందును, విశ్వమంతటి మీదనున్న అధికారమంతటిలోను దైవత్వము ఆయనలో సంపూర్ణముగ నివసించెను. మరియు "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు''. అంటే అన్నిటి కంటె ముందుగా సృజింపబడినవాడని దీని యర్థము కాదు. "ఆయనే సమస్తమునకు

ఆధారభూతుడు". క్రీస్తు వలన క్రీస్తు ద్వారా సమస్తమును సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా యుండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. ఆయన లేకుండా యేమియు కలుగలేదు. సృష్టియంతటికి ముందునుండే క్రీస్తు ఉండెనని మనము గ్రహించవలెను. ఆద్యారంభముననే యున్నవాడు ఆదిలేని వాడనికూడ మనము గ్రహించుట అత్యవుసరము. యేసుక్రీస్తు ఆదినుండి యుండెను. ఆదిలో ఆయన వాక్యమై యుండెను. ఆయన దేవుడై యుండెను. ఇప్పుడును ఆయన దేవుడై యుండెను. అందుకే అపొ. పేతురు ఆయనను మన దేవుడును రక్షకుడైన యేసుక్రీస్తు అని సంబోధించెను. యిందును బట్టి యేసుక్రీస్తు దేవుడని, దేవుని కుమారుడని మనము విశ్వసించవలెను. మన పాపములను క్షమించువాడాయనే గనుక మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను.

తరువాత సంచికలో యేసుక్రీస్తు యొక్క దైవత్వమును గూర్చి మరికొంత తెలిసికొందుము. ఈలోగా యేసుక్రీస్తును నమ్మి ఆయన ఆజ్ఞలకు విధేయులై రక్షణ పొందండి. – జాషువాగూటం

## నీ వాక్యమే సత్యము

### ( Thy word is Truth )

యోహాను 14:6లో యేసు తానే సత్యమని చెప్పారు గాని, యోహాను 17:17 లో యేసు లేఖనములు సర్వసత్యమని, "నీవాక్యమే సత్యమని" పలికారు. పాత క్రొత్త నిబంధనలు రెండు కలిసి "సత్యవాక్యమై"యున్నవి (కీర్తన 119:43, 2కొరింధీ 6:7, ఎఫెసీ 1:13, కొలస్స 1:5, 2తిమోతి 2:15, యాకోబు 1:18).

"ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల ఎటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలనుకీళ్లను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4:12).

దేవుని వాక్యము దిగువ ప్రశస్త సంగతులను సాధించును :-

1. మన హృదయాలలో విశ్వాసము కలిగించును "కాగా వినుట వలన విశ్వాసము కలుగును" (రోమా 10:17).

2. ప్రతిష్టచేయును "సత్యమునందు వారిని ప్రతిష్టచేయుము; నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17).

3. ప్రాణమును తెప్పరిల్లజేయును : "యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యథార్థమైనది, అది ప్రాణమును తెప్పరిల్లజేయును" (కీర్తన 19:7).

4. మన ఆత్మలను రక్షించును : "లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1:21).

5. నూతన జన్మనిచ్చును : ఆయన "సత్య వాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను" (యాకోబు 1:18).

6. శిశువులు ఎదుగునట్లు చేయును : "మీరు క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగునట్లు ఆ పాలను అపేక్షించుడి" (1పేతురు2:2).

7. మనలో నివసించును : "చిన్న పిల్లలారా మీరు బలవంతులు – దేవుని వాక్యము మీయందు నివసించుచున్నది" (1 యోహాను 2:14).

8. కార్యసిద్ధి కలుగజేయును : "మీరు దేవుని గూర్చిన వర్తమాన వాక్యము మా వలన అంగీకరించినప్పుడు.. మేమును మానక కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నాము. ఆ వాక్యమే విశ్వాసులైన మీలో కార్యసిద్ధి కలుగజేయు చున్నది" (1 థెస్స 2:13)

9. మనలను నడిపించును : "నీ ఆలోచన చేత నన్ను నడిపించెదవు" (కీర్తన 73:24).

10. "నీ వెలుగును సత్యమును బయలుదేర జేయుము, అవి నాకు త్రోవ చూపును (కీర్తన 43:3).

11. పాపముచేయకుండ కాపాడును : "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను" (కీర్తన 119:11).

12. "యౌవనస్థులు దేనిచేత తమ నడతను శుద్ధిపరచుకొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుటచేతనే గదా?"(కీర్తన119:9).

13. జ్ఞానమును పుట్టించును : "యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యథార్థమైనది అది ప్రాణమును తెప్పరిల్లజేయును. యెహోవా శాసనము నమ్మదగినది అది బుద్ధిహీనులకు జ్ఞానమును పుట్టించును" (కీర్తన 19:7).

14. "నీ ఉపదేశము వలన నాకు వివేకము కలిగెను, తప్పుమార్గములన్నియు నా కసహ్యములాయెను" (కీర్తన 119:104).

15. "నీ వాక్యము నన్ను బ్రదికించి యున్నది. నా బాధలో ఇదే నాకు నెమ్మది కలిగించుచున్నది" (కీర్తన 119:50).

16. "మనుష్యుడు రొట్టెవలన మాత్రము జీవించడుగాని, దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాటవలన జీవించును" (మత్తయి 4:4).

17. "నీవిచ్చిన వాక్యము మనుష్యులలో

నీ భయమును పుట్టించుచున్నది, నీ సేవకునికి దాని స్థిరపరచుము" (కీర్తన 199:38).

18. "నీ శాసనములు నాకు సంతోషకరములు, అవినాకు ఆలోచనకర్తలై యున్నవి" (కీర్తన 119:24).

19. "నీ శాసనములను నేను ధ్యానించు చున్నాను. కావున నా బోధకులందరి కంటె నాకు విశేష జ్ఞానము కలదు" (కీర్తన 119:99).

20. "లేఖనములను అతిక్రమింప కూడదు" (1 కొరింధి 4:6).

21. "ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నది" (2పేతురు 1:3).

22. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్య మునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును ఖండించుటకును తప్పు దిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16-17).

-హ్యూగోమెకార్డ్

## మూడు సిలువలు

## ( Three Crosses )

పరిచయము :

1. నజరేయుడైన యేసుక్రీస్తు యెరూషలేము వెలుపల కల్వరికొండ పై సిలువ వేయబడెను (మత్తయి 27:33-35, లూకా 23:33).

2. యేసుతో కూడ సిలువ వేయబడుటకు మరో ఇద్దరు అక్కడికి నడిపింపబడిరి (లూకా 23:32). వారిద్దరు బందిపోటు దొంగలు.

3. ఈ యిద్దరి దొంగల మధ్య యేసు ప్రభువు సిలువవేయబడెను.

**1. ఒక దొంగ యొక్క సిలువ** తిరుగుబాటు, క్రోధము సూచించెను. అతడు పశ్చాత్తాపము లేనివాడు.

**ఎ. ఆ దొంగ యేసును హేళన చేసెను.**

1. అతడాయనను దూషించాడు: "నీవు క్రీస్తువు గదా, నిన్ను నీవు రక్షించుకో మమ్మును కూడ రక్షించు"మని పలికాడు (లూకా 23:39)

2. అతడు పొందుచున్న ఘోరమైన బాధకంటే యేసును చేసిన హేళన ఎక్కువాయెను.

3. మరియు అట్టి పరిహాసమునకు అవకాశమిచ్చునది ఏదీ యేసు చేయలేదు.

4. ఈ దొంగ యొక్క మాటలవలన అతడు తిరుగుబాటు చేయువాడు, క్రోధ పూరితుడు మరియు పశ్చాత్తాపము లేనివాడు.

**బి. ఈ దొంగ నశించు అనేక ఆత్మలకు గురుతుగా యున్నాడు.**

1. కోట్లాది ప్రజలు వారి ఆత్మవిషయమై చింత యేమిలేకుండానే మరణించుచున్నారు.

2. మన చుట్టు నివసించుచున్న కోట్లాది ప్రజలు దేవుని నీతిని లక్ష్యము చేయకనే జీవించుచున్నారు.

3. వారు ప్రభుత్వముల పై తిరుగుబాటు చేయుచు, నేరముచేయుచు పట్టుబడినా పశ్చాత్తాపము గాని, భయము గాని లేకయున్నారు.

4. వారిలో కొందరు మేము పరలోకమునకు వెళ్లగోరుటలేదని కూడ ప్రగల్భాలు పలుకుదురు.

**సి. యేసుక్రీస్తు సువార్తకు లోబడ కుండా యున్న అనేకులకు ఆ దొంగ మాదిరిగా యున్నాడు.**

1. ఈ దొంగ ఒక అవిశ్వాసి.

2. తన మాట ప్రకారమే రక్షింపబడాలని అతడు కోరాడు. అదే రీతిగా అనేకులు తమ యిష్టప్రకారమే రక్షింపబడాలని కోరుదురు.

3. తదుపరి ఈ దొంగ చాలా శంకించువాడు, అవకాశం దొరికితే ప్రభువు సూచకక్రియ చేస్తే నమ్ముదుననే వాడు! నేటి ప్రజలు కూడ ఏమంత వేరుగా లేరు. యేసుప్రభువు అనేక అద్భుతములు చేసి దేవుని కుమారుడని నిరూపించు కొనినా నేటి ప్రజలు సూచక క్రియలను వెదుకుచున్నారు (మార్కు 16:20; హెబ్రీ 2:3-4; యోహాను 20:30-31).

**2) రెండవ దొంగ, అతని సిలువ మారు మనస్సుకు సూచనగాయున్నది. ఆత్మలు రక్షింపబడగల స్వభావమును అతడు కలిగియుండెను.**

**ఎ. రెండవ దొంగ యేసే క్రీస్తు అని ఒప్పుకొన్నాడు (లూకా 23:40-43)**

1. యేసు యొక్క పరిచర్యను ఆరోజులలో అందరు ఎరిగియుండిరి.

2. యేసే దేవుడని ఆ దొంగ గుర్తించెను (లూకా 23:40)

3. మరియు అతడును వేరొక దొంగయు నేరస్థులమని, యేసు నిరపరాధియని అతడు అంగీకరించాడు (లూకా 23:41).

4. యేసే రక్షకుడని, వాగ్ధానము చేయబడిన రాజ్యస్థాపన చేయువాడని ఆ దొంగ నమ్మెను.

5. వారిద్దరి మధ్యనున్న సిలువ పైనున్న

వ్యక్తికి తన ఆత్మను అప్పగించునంత మట్టుకు అతడు ఆయనయందు విశ్వాస ముంచాడు.

**బి. ఆ దొంగ విశ్వసించుటయే గాక, మారు మనస్సుపొందాడు :**

1. ఈలోకం ఎరిగిన ఏకైక రక్షకుని అతడు తన ఆత్మరక్షణ విషయము విజ్ఞాపన చేసాడు.

2. యేసు ఆ దొంగను తక్షణమే క్షమించారు. (అప్పటికింకా మోషే ధర్మ శాస్త్రము అమలులో యుండెను (హెబ్రీ 9:16-17). ఇప్పుడైతే క్రొత్త నిబంధన అమలులో యున్నందున మనము దాని షరతులకు లోబడాలి (రోమా 1:16).

3. పాపములు క్షమింపబడినందున దాని పర్యవసానము సంభవింపదని యర్థము కాదు. ఆ దొంగ తన నేరమును బట్టి శిక్షించబడ్డాడు. అది న్యాయమే (రోమా 13: 1-7).

**సి. మారుమనస్సు పొందిన ఈ దొంగ సాటి నేరస్థునిగద్దించాడు, యేసును సమర్థించాడు.**

1. ప్రభువును వెంబడించువారు అవినీతిని ఖండిస్తారు (1పేతురు 5:8-9; యాకోబు 4:7).

2. ప్రభువును వెంబడించు వారు నీతిని యదార్థతను సమర్థిస్తారు, పరిరక్షిస్తారు (ఫిలిప్పీ 1:17; యూదా : 3).

3, మారుమనస్సు పొందిన వారు తమ గత పాపముల నుండి హృదయ పూర్వకముగా మార్పుజెందుదురు (2 కొరింథీ 6:14-18).

**3) మన రక్షకుడైన యేసు మధ్యనున్న సిలువ పై నుండిరి :**

**ఎ. మధ్యనున్న సిలువను పలు విధములుగా వీక్షించవచ్చును.**

1. మారుమనస్సు లేని దొంగ యేసును ఒక మనుష్యునిగా, తనవంటి వానిగా, వంచకుడైన రక్షకునిగా చూచాడు.

2. మారుమనస్సు పొందిన రెండవ దొంగ మధ్యసిలువపై నున్న యేసును దేవుని కుమారుడుగా, మానవ రక్షకునిగా చూచాడు.

**బి. యేసుప్రభువు తన కొరకు గాక మన కొరకు సిలువ బాధననుభవించారు.**

1. ఆ దొంగలు తమ కొరకు తామే చనిపోయారు. యేసు ఇతరుల పాపముల కొరకు చనిపోయారు (2కొరింథీ 5:21, 1పేతురు 2:21-24, 3:8).

2. మధ్యనున్న సిలువ పై యేసు యొక్క మరణము ప్రవచనముల నెరవేర్పైయున్నది (యెషయా 53:4-12).

3. బంధింపబడిన యేసు యొక్క పవిత్ర రక్తము మన ఆత్మలను రక్షించును (1 పేతురు 1:18-20; ఎఫెసీ 1:7).

**సి. యేసుక్రీస్తు ఈలోక రక్షకుడు. రక్షింపబడగోరు వారందరు ఆయన వైపు మార్పుచెందాలి.**

1. నశించిన వారిని రక్షించుటకే ఆయన ఈలోకమునకు వచ్చెను (లూకా 19:10; మత్తయి 1:21-23).

2. నమ్మిన వారిని యేసు రక్షించును (యోహాను 8:24; మార్కు 16:16).

3. మనసం మారుమనస్సు పొంది ఆయనను బహిరంగముగా ఒప్పుకొనాలని యేసు కోరుచున్నారు (లూకా 13:3; మత్తయి 10:32-33).

4. రక్షింపబడగోరువారు యేసుకు విధేయత చూపాలి (లూకా 6:46; హెబ్రీ 5:8-9).

5. రక్షింపబడిన వారిని యేసుక్రీస్తు తన సంఘముతో చేర్చుకొనును (అపొ.కా. 2:47).

**ముగింపు:**

1. మారుమనస్సు పొందని పాపులు నశిస్తారు.

2. మారుమనస్సు పొందిన పాపులు రక్షింపబడు నిమిత్తము బాప్తిస్మము పొందాలి.

3. "నేను పాపము చేసాను" అని ఒప్పుకొనే మాటతో రక్షణ మార్గము ప్రారంభిస్తాది (నెహెమ్యా 1:6).

4. పాపపరిహారార్థము యేసుక్రీస్తు తన రక్తాన్ని చిందించారు. దేవుని కృపవలన మానవులు రక్షింపబడుదురు (రోమా 3:23-25).

**ఆహ్వానము:**

నీవు మాటలు, ప్రవర్తన మారుమనస్సు పొందిన దొంగవలె యున్నవా ? మధ్యనున్న ఆ సిలువను గూర్చి నీ ప్రవర్తన ఎట్లుండునో, దానిని బట్టియే నీ నిత్యత్వము నిర్ధారింపబడును.

నీవు బాప్తిస్మము పొంది, క్రీస్తును ధరించు కొని, రక్షింపబడిన వారితో చేర్చబడుము (గలతీ 3:27; అపొ.కా. 22:16).

క్రైస్తవుడవై పాపముచేస్తే రక్షకుని దగ్గర క్షమాపణ కోరుతూ చేరుకొనుము (1 యోహాను 1:7-9).

-లూయిస్ రష్‌మోర్



# పాపుల మిత్రుడు

## ( A Friend of Sinners)

యేసు ఏ పాపము చేయకపోయినా, పాపముతో నిండియున్న లోకంలో జీవించారు. ఆయన జననము మొదలుకొని సిలువ పై మరణము వరకు ఆయన జీవితమంతయు పాపముకై వెచ్చించెను. ఆయన పెదవుల నుండి పాపపు మాట ఒక్కటియైనను రాలేదు. పాపపుపని ఆయన యేమీ చేయలేదు. పాపపు తలంపులు ఆయన ఎన్నడు ఆలోచించలేదు. ఆయన పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడు (హెబ్రీ 9:25-26). తన జీవితంలో పాపమును నిరూపించుమని తనకాలము నాటి వారిని ఆయన సవాలు చేసెను (యోహాను 8:46). వారు కనుగొనలేక పోయారు. ఆయన ఏ పాపమును చేయలేదు (1పేతురు 2:21). ఏ పాపమును ఎరుగడు (2 కొరింథీ 5:21). ఆయనలో పాపము ఏమియులేదు (1 యోహాను 3:5). అయినను పాపియొక్క మంచి మిత్రుడాయనే. ఎందువలన? దిగువ సంగతులు గమనించగోర్తాను.

మొదటిగా, యేసుక్రీస్తు అతిక్రమము చేయువారిలో లెక్కింపబడెను గనుక ఆయన పాపుల మిత్రుడు. ఆయన "అతిక్రమము చేయువారిలో ఎంచబడిన వాడాయెను. అనేకుల పాపమును భరించుచు తిరుగుబాటు చేసినవారిని గూర్చి విజ్ఞాపనము చేసెను" అని యెషయా ప్రవచించెను (యెషయా 53:12). అతిక్రమము చేయువారిలో ఎంచుబడుట యనగా పాపము చేయువారితో ఎంచబడుటయే, ఏలయనగా అజ్ఞాతిక్రమమే పాపము (1 యోహాను 3:4). సుంకరియైన మత్తయిని అపొస్తలునిగా యుండుటకు యేసు పిలిచెను. మత్తయి ఆయన పిలుపు నంగీకరించి తన యింటిలో గొప్ప విందు ఏర్పాటుచేసెను. అది సుంకరులతో నిండి యుండెను. తనతో భోజనము నకతడు యేసును ఆహ్వానించెను. దాని నాయన అంగీకరించెను. అప్పుడు శాస్త్రులును పరిసయ్యులును అదిచూచి, "సుంకరుల తోను పాపులతోను మీరేల తినిత్రాగు చున్నారని ఆయన శిష్యులమీద సణగిరి" (లూకా 5:27-30). "అందుకు యేసు -

రోగులకే గాని ఆరోగ్యము గలవారికి వైద్యుడక్కరలేదు. మారుమనస్సు పొందుటకై నేను పాపులను పిలువ వచ్చితిని గాని నీతిమంతులను పిలువరాలేదని వారితో చెప్పెను" (లూకా 5:31-32). అవును, క్రీస్తు ఈ లోకములో యుండగా పాపులతో కలిసిమెలిసి తిరిగెను.

లూకా 7-36-39లో పరిసయ్యు డొకడు యేసును భోజనమునకు ఆహ్వానించిన సందర్భమును చూడగలము. ఆయన భోజనపంక్తిని కూర్చుండగా పాపాత్మురాలైన యొక స్త్రీ ఒక బుడ్డిలో అత్తరు తీసికొనివచ్చి వెనుక తట్టు ఆయన పాదముల యొద్ద నిలబడి యేడ్చుచు కన్నీళ్లతో ఆయన పాదములు తడిపి, తన తలవెంట్రుకలతో తుడిచి, ఆయన పాదములను ముద్దుపెట్టుకొని ఆ అత్తరు వాటికి పూసెను. ఆయనను పిలిచిన పరిసయ్యుడు అదిచూచి - ఈయన ప్రవక్తయైన యెడల తన్ను ముట్టుకొనిన స్త్రీ ఎవతియో, ఎటువంటిదో యెరిగి యుండును; యిది పాపాత్మురాలు అని తనలో తాననుకొనెను. అవును యేసు పాపులతో కలిసిమెలిసెను. అతిక్రమము చేయువారిలో ఎంచబడిన వాడాయెను.

"ఒకప్పుడు సమస్తమైన సుంకరులును పాపులను ఆయన బోధ వినుటకు ఆయన దగ్గరకు వచ్చుచుండగా, పరిసయ్యులును శాస్త్రులును అదిచూచి- ఇతడు పాపులను చేర్చుకొని వారితో కూడ భోజనము చేయుచున్నాడని చాల సణుగుకొనిరి" యని లూకా 15:1-2లో వ్రాయబడియున్నది. "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని'' యేసు చెప్పెను (లూకా 19:10). అందువలననే ఆయన పాపుల మధ్య ఎల్లప్పుడు యుండెను. ఆయన ఇద్దరు దొంగల మధ్య సిలువవేయబడెను. పాపులలో ఒకనిగా సిలువ వేయబడెను. వారిద్దరిలో ఒకనితో, "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పు చున్నాననెను" (లూకా 23: 39-43).

యేసు ప్రభువు ఎవరితో సహవాసము చేసారో, అట్టివారితో స్నేహం చేయుటకు మనం ఇష్టపడము. మన కాలమునాటి పాపులను మనం నిర్లక్ష్యం చేస్తే ఈ లోకానికి సువార్త ఎట్లు ప్రకటించగలము? మనం మనవారితోనే

సహవాసం చేయగోర్తాము. అందువలన సంఘము క్షీణించుచున్నది. సంఘమునకు వెలుపల యున్నవారికి, లోకస్థులకు సువార్త బోధించాలి. క్రైస్తవులను చేయాలి.

రెండవదిగా, పాపుల పాపములను తీసివేయుటకు యేసుక్రీస్తు సిలువపై మరణించెను గనుక ఆయన పాపుల మిత్రుడు. "నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడిన వానిగాను, దేవుని వలన బాధింపబడిన వానిగాను, శ్రమనొందిన వానిగాను మనమతనిని ఎంచితిమి. మన యతిక్రమక్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొఱ్ఱెల వలె త్రోవతప్పిపోతిమి. మనలో ప్రతివాడు తన కిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనయందరి దోషమును అతని మీద మోపెను" (యెషయా 53:4-6). "మనము పాపముల విషయమై చనిపోయి నీతివిషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను" అని పేతురు చెప్పెను (1పేతురు 2:24). "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను" అని పౌలు చెప్పెను (1 కొరింథీ 15:3). పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనని కూడ అతడు చెప్పెను (1 తిమో 1:15). పాపమును, అపవిత్రతను పరిహరించుటకై తీయబడు ఊటను గూర్చి జెకర్యా 13:1లో చెప్పబడినది. "ఇమ్మానుయేలు రక్తము ఇంపైనయూటగు, ఓ పాపి యందు మున్గుము పాపంబు పోవును" అనే పాట మనందరం పాడుచుందుము. ఎంత నిజమో! పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు తన రక్తమును చిందించెను (మత్తయి 26:28). నిజముగా, యేసుక్రీస్తు లోకపాపములను మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్లయే!

మూడవదిగా, అతిక్రమము చేయువారిని గూర్చి ఆయన విజ్ఞాపనము చేయును గనుక క్రీస్తు పాపుల మిత్రుడై యున్నాడు (యెషయా 53:12). "ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి

పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడై యున్నాడు" (హెబ్రీ 7:25). మనం పాపము చేసినప్పుడు దేవునికిని మనకును మధ్యవర్తి ఒకరున్నారు. ఆయన క్రీస్తు యేసను నరుడు (1 తిమోతి 2:5). మనం పాపము చేసినపుడు మారు మనస్సు పొంది దేవుని క్షమాపణ నడిగిన యెడల మనలను గూర్చి యేసుక్రీస్తు దేవుని దగ్గర విజ్ఞాపనము చేయును. "ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు" (1 యోహాను 1:21). "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:9).

"సహోదరుని కంటెను ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు" అని సొలొమోను చెప్పెను (సామెతలు 18:24). సొలొమోను చెప్పిన స్నేహితుడు యేసుక్రీస్తే! దయగల మన యేసు ఎంతో గొప్పమిత్రుడు! తన స్నేహితుల కొరకు తన ప్రాణమును పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు. నేను మీకాజ్ఞాపించు వాటిని చేసినయెడల మీరు నా స్నేహితులై యుందురు" అని యేసు చెప్పెను (యోహాను 15 : 13-14). యేసు పాపుల మిత్రుడు! పాపులు ఆయన మిత్రులుగా యుండగోరుదురు.

నీవాయన చిత్తమును జరిగించిన యెడల నీవు యేసు యొక్క మిత్రుడవు కాగలవు. తనకు విధేయులైన వారందరికీ ఆయన నిత్య రక్షణకు కారకుడు (హెబ్రీ 5:8-10). మనం ఆయన యందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించు చున్నారు (యోహాను 8:24; లూకా 13:3; మార్కు 16:16). రక్షింపబడి మరణ పర్యంతము నమ్మకముగా యున్న యెడల మనం ఆయనకు మిత్రులుగా యుండగలము (ప్రకటన 2:10).

– జాన్‌స్టేసీ

## సంక్షిప్త వార్తలు

2016 సెప్టెంబరు 10వ తేదీ శనివారం నాడు గన్నవరం మండలం ముంగండలో సోదరులు చేరుగొండి జాన్‌బాబు గారి ఆధ్వర్యమున చక్కటి సువార్త కూటము జరిగెను. స్థానిక సంఘము మరియు పరిసరగ్రామములలో సువార్త చాటుచున్న అనేకమంది సహోదరులతో ముంగండ క్రీస్తుసంఘ ఆవరణము పూర్తిగా నిండెను. సోదరులు బొంతు వెంకటరమణ (అమలాపురం) గారు అధ్యక్షత వహించి కూటమును చక్కగా నడిపించిరి. సోదరులు పి.జె. కృపాలిని (పలివెల) గారు ఆహ్లాదకరమైన మధురగీతముల నాలపించిరి. మరియు డి. ఇశ్రాయేలు రాజు, అజ్జరపు అబ్బాయి, నేలపూడి కృష్ణమూర్తి, యస్. యేసురత్నం గార్లు మరియు అనేకమంది సోదరులు పాటలలోను, ప్రార్థనలలోను, వాక్యపఠనములోను సహకరించిరి. సోదరులు జాన్‌బాబు గారు ముంగండలో 40సం॥ల క్రితము క్రీస్తుసంఘము ఎట్లు ప్రారంభించబడినో దాని చరిత్రను, జాషువాగూటం గారు అందించిన సహాయ సహవాసములను వివరించిరి. తదుపరి జాషువాగూటం గారు చక్కటి వాక్యపరిచర్యచేసిరి. కూటము అనంతరము వచ్చిన వారందరికీ మంచి భోజనము ఏర్పాటుచేయబడెను. జాన్‌బాబు గారి నిర్విరామకృషికి, పరిచర్యకు సత్యవాక్కు అభినందనలు తెలియజేయుచున్నది.

2016, సెప్టెంబరు 14వ తేదీ బుధవారము కాకినాడ సత్యవాణి - క్రీస్తుసంఘ ఆవరణములో ఉభయగోదావరి జిల్లాల సువార్తికుల సదస్సు రిక్కీగూటం గారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేయబడెను. పలుప్రాంతముల నుండి వచ్చిన అనేక సువార్తికులతో సత్యవాణి ప్రాంగణము కలకలలాడెను. సోదరులు రిక్కీ గారు సమర్థవంతమైన నాయకత్వము వహించగా సోదరులు ఎలిపే ప్రభాకర్ (కాకినాడ), విప్పర్తి బాబీ (అమలాపురం), యన్.నతానియేలు (రాయవరం), జాషువాగూటం గార్లు వాక్య పరిచర్యచేసిరి. ఐక్యతను సాధించు ఏడుసూత్రములను జాషువా గారు చక్కగా వివరించిరి. సోదరులు

యమ్. కృపారావు (నర్సీపట్నం) గారి ప్రార్థనతో మధ్యాహ్న భోజన విరామం అనంతరం తరగతులకు సదస్సుముగిసెను. ముగ్గురు సువార్తికులకు రిక్కీ గారు సైకిళ్ళను బహుకరించిరి.

2016 నవంబరు 8,9,10,11 తేదీలలో కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘము బైబిల్ లెక్చర్‌షిప్ జరిపించుచున్నారు. ప్రతిసంవత్సరము ఈ కూటములకు వందలాది ప్రజలు హాజరగుచున్నారు. హాజరైన వారందరికీ రుచి, శుచికరమైన ఆహారము సమృద్ధిగా ఉచితముగా అందజేయబడును. దూరప్రాంతముల నుండి వచ్చినవారికి వసతి సదుపాయము కల్పించబడును. అమెరికా, ఇండియా సహోదరులు సమృద్ధిగా ఆత్మీయాహారమును వడ్డింతురు. మీ స్థానిక సంఘముతో కలసి ఈ బైబిలు లెక్చర్‌షిప్‌కు హాజరుగుటకు సిద్ధపడమని మనవి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17
Date of Posting: 14 & 15th every month

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.